# 'చదువుకున్న వారికన్నా...'

ప్రొద్దున్న ఏడున్నరకల్లా హాస్టలు కొచ్చే దోవలో కనుపిస్తుంది ఒక బక్కపిల్ల. మామిడి చెట్ల క్రిందగా నడిచి వస్తుంది పెద్ద మూటతో. బ్రహ్మాండంగా వున్న 'ఎంప్రెస్ గేటు' దాటి యూనివర్సిటీ మహిళా హాస్టలులోకి ప్రవేశిస్తుంది. విశాలంగా పరుచుకుని వున్న రావి చెట్టు మొదట్లో తిన్నెలున్నాయి. వాటిమీద మూటదించి, బట్టలు విడదీసి చిన్న మూటలు కట్టి రూములలోకి వెడుతుంది.

ఆ పధ్నాలుగేళ్ళ చాకలి పిల్ల పేరు సక్కు. 'విమెన్సు హాస్టలు' పిల్లల బట్టలు ఎన్ని సంవత్సరాల నుంచో వుతుకుతున్నారు వాళ్ళ కుటుంబ వ్యక్తులు. మోకాలు పైకి చిన్న నేత చీరె బూడిద రంగుది కట్టుకుంటుంది. తల దువ్వుకున్నట్లు కనుపించదు. ఎప్పుడూ ముఖాన నవ్వు తప్పదు.

ఒకొక్క బ్లాకులో బట్టలు యిస్తూ వస్తుంటుంది. బట్టలు వేసే వాళ్ళు పిలుస్తారు. తీసుకున్న వాళ్ళు పద్దులు చూసుకుంటారు. రెండో బ్లాకులో బట్టలిస్తుంటే, మొదటి బ్లాకులోంచి వినవస్తుంది పిలుపు. "సక్కూ!" అని పిలుస్తారు పొడుగాటి ముస్లిమ్ పిల్లలు. వాళ్ళ పైజమాల యిస్త్రీ సరిగ్గాలేదు. నాలుగు పైజమాలు తిరిగి యిచ్చి మళ్లీ చేసుకురమ్మంటారు. "అచ్ఛా అమ్మా!" అంటుంది సక్కు.

ఈలోగా రెండో బ్లాకులోంచి "సక్కూ" అన్న పిలుపు ప్రతిధ్వనిస్తుంది వరండాల్లో. "అమ్మా" అంటూ పరుగుల మీద వెడుతుంది సక్కు.

"ఇదిగో యీ బట్టలు పదహారు. ఆ జార్జెట్ రంగు పోయిందంటే వూరుకోను. ఈ నూలుచీరెలన్నిటికీ గంజి బాగా పెట్టుకురావాలి" అని పురమాయిస్తుంది ఒక సీనియరు అమ్మాయి.

"మంచిది అమ్మా" అంటుంది సక్కు నవ్వుతూ.

సక్కు తెచ్చిన బట్టలు చూసుకుంది రుక్మిణి అనే సుందరాంగి. ఆ రోజు ఆవిడ ఫస్టవరు క్లాసు మానేసి వాళ్ళ బావని కలుసుకోవాలి. చెమ్కీపూల తెల్ల జార్జెటు కట్టుకుంది క్రిందటిమాటు ఆమె. ఆ బావ మురిసిపోయి "వెన్నెలలాగా, మల్లెపూవులాగా, మబ్బు పింజెలాగా వున్నావని ఎన్ని మాటలో అన్నాడు. ఆనాటి మాటలు తలుచుకుని, తలుచుకుని, రుక్మిణి మనస్సులో ఆరాటపడి పోయింది. ఉతుకుకి వెళ్ళిన ఆ చీరె కోసం, వేళకు ఆ చీరె తెచ్చినందుకు సక్కుని వేయి విధాల ప్రశంసించింది ఆమె.

అద్దం ముందు నుంచుని, తెల్ల క్రేప్ జాకెట్టు కాలరు సరిచేసుకుని, రెండు జడలకి తెల్ల శాటిన్ రిబ్బన్లు కట్టుకుంది రుక్మిణి. మల్లెపూవు లాంటి ఆ చీరెని ఒంటి మీద వేసుకుని చూసి, సిగ్గుపడుతూ నవ్వి,

ఒక్కనిముషంలో కట్టేసుకుంది. కానీ... కానీ... ఆ చీరె మీద, పమిట మీద కాణీ అంత నల్ల మరక! కళ్ళు పెద్దవి చేసి,పరీక్షగా చూసిన రుక్మిణి కోపగించుకుంది. చీకాకు పడింది. చెదరిపోయిన కలను తల్చుకుని ఆమె హృదయం బాధతో స్పందించింది. "సక్కూ!" అని కోపంగా గట్టిగా యెలుగెత్తి పిల్చింది. సక్కు వచ్చింది. "ఏమిటి?" అని గర్జించింది రుక్మిణి. చిరునవ్వు పోలేదు సక్కు ముఖాన.

"ముందే వుండెను అమ్మా ఇది" అంది.

"లేదు లేదు. తీసుకుపో" అని కోపంతో ఆ చీరె గబగబ విప్పి సక్కు ముఖాన కొట్టి మరో చీరె తీసుకుంది. సక్కు నిశ్శబ్దంగా నిల్చున్నది. "మళ్లీ ఉతుక్కు రావాలీ అమ్మా!" అన్నది మెల్లిగా. రుక్మిణి రోషంతో వుంది అసలే. "లేకపోతే నన్ను చాకిరేవు పెట్టుకోమంటావా?" అని వురిమి, బొట్టు దిద్దుకోవడంలో నిమగ్నమైంది రుక్మిణి..

సక్కు మరో గదిలోకి వెళ్ళింది.

"ఇదేమిటి సక్కూ! ఈ జరీ చీరె యిస్త్రీ ఏమిటి? తెల్ల బట్టలకి అసలు నీలిమందే వేయలేదు" అన్నది మృదువుగా రోహిణి.

"అది రాలేదు అమ్మా! నిండా కష్టమైంది యిస్త్రీ చేసేదానికి" అన్నది సక్కు అర్థం లేని చిరునవ్వుతో.

ఓ నిముషమాగి "పైసలు యిస్తారమ్మా!" అని అడిగింది సంకోచంతోనే. అలమారు తెరచి డబ్బు యిచ్చేసింది రోహిణి. సక్కు డబ్బు లెక్కపెట్టి అర్థం కానట్లు చూసి "ఇదేమిటి అమ్మా! సిల్కు చీరకి ఎన్ని పైసలు యిచ్చినారు?" అన్నది.

"రెండణాలు" అన్నది. రోహిణి పరధ్యానంగా. లేతాకుపచ్చ చీరె మీదకి ముదురాకుపచ్చ క్రేపా, నలుపు కణువు చోళియా అన్న సమస్య తేలక అవస్థ పడుతోంది ఆమె..

"అదేమిటి అమ్మా! నాల్గు అణాలు యియ్యాలు. అందరు అట్టనే యిస్తారు" అన్నది సక్కు.

"ఎవరిస్తున్నారు? నేనెప్పుడూ యివ్వలేదు" అన్నది రోహిణి చటుక్కున వెనక్కి తిరిగి.

"“లేదు అమ్మా! నేను అబద్ధం చెప్పలేదు"

"నేనివ్వను" అన్నది రోహిణి. సక్కు ముఖంలో చిరునవ్వు ఒక్క క్షణం మాయమైంది. మరుక్షణంలోనే, "అట్ల చెప్పవద్దు అమ్మా! అన్యాయం సెయ్యవద్దు అమ్మా!" అన్నది దీనంగా. అమాయకంగా. కాని వినదు రోహిణి. వినిపించుకోదు. ఆకుపచ్చ చీరె, నల్లజాకెట్టు తీసుకుని సన్నగా పాడుకుంటోంది ఆమె.

"సక్కూ" మూడో బ్లాకులోంచి మరోకంఠం.

"వస్తుంటి అమ్మా!" అంటుంది సక్కు.

"కిందటి మాటు టవల్ బాకీ ఏదీ?" అనడిగింది జడేసుకుంటూ రత్నమాల.

సక్కు నాలిక్కరచుకుంది. "అరే! మర్చిపోయాను అమ్మా! రేపు తీసుకు వస్తాను" అన్నది.

"సరే నా నల్ల చుక్కల బ్లౌజ్ వుండాలి. కనుపించటం లేదు. ఏమైంది?" సక్కు అర్థం కానట్లు చూసింది.

"ఏది అమ్మా! నాకు యిచ్చినారూ?" అన్నది.

"ఔను. ఎప్పుడో వేశాను. ఉండాలి చూడు" అన్నది రత్నమాల.

"లేదు అమ్మా! మా దగ్గర ఉంటే ఎక్కడా పోదు."

"ఉంటుంది చూడు" అని స్నానానికి పోబోతోంది రత్నమాల.

"అమ్మా! పైసలు యిస్తారూ?" అంది సక్కు.

"ఇప్పుడు కాదు రేపు." రత్నమాల వెళ్ళిపోతోంది. సక్కు వెంట వెళ్లింది.

"మాది నాయన కోపం చేస్తాడు అమ్మా!. జరూర్ అనినాడు. ఇవ్వరా అమ్మా?" అన్నది సక్కు. రత్నమాలకి కోపం వచ్చింది.

"ఇస్తాలే ఫో! ఏమిటి అప్పులదానల్లే గొంతు మీద కూర్చుంటావు? ఇల్లా గల్లంతు చేస్తే అసలివ్వను" అంటూ విసవిస నడిచింది రత్నమాల.

హాస్టలులో గంటకొట్టారు. ఫలహారానికి. పిల్లలంతా... గ్రాడ్యుయేట్లు, కాబోయే వైద్యులు, ఉపాధ్యాయులు, ఇంటర్మీడియేట్లు అంతా పోతున్నారు. గుంపులు గుంపులుగా. నేతచీరలు, జార్జెట్లు, షిఫాన్లు, క్రేపులు, ప్రింటింగ్సు, వాయిల్స్... రకరకాలు, రంగులు రంగులు, చిత్ర విచిత్ర అద్దకాలు అల్లా నడిచిపోతున్నాయి.

చిన్న చిన్న బట్టల మూటలు కట్టుకుంటూ వాళ్ళ వంక అలా చూస్తూ నిలబడింది సక్కు. ఆ రంగుల సీతాకోక చిలుకల్ని, పూలతోటల్ని, జ్ఞాపకానికి  తెస్తున్నాయి. అవన్నీ, ఆ బట్టలన్నీ తను కాయకష్టం చేసి. శుభ్రం చేసింది. స్వహస్తాలతో మడిచి, పువ్వుల కన్న పదిలంగా పట్టుకొచ్చింది.

కాని, కొందరి నూలు చీరెలకి గంజి చాలదు. తెల్లబట్టలకి నీలిమందు చాలదు. మరి కొందరికి యిస్త్రీ సరిపడదు. ఇవ్వాల్సిన డబ్బు యివ్వడం కష్టం కొందరికి. ముస్తాబుతో అసలే తీరిక వుండదు మరి కొందరికి.

ఇవన్నీ తలుచుకుని ఆ 'అమ్మ'ల మీద కసురుకోదు సక్కు. వాళ్ళని మనస్సులోనైనా తిట్టుకోదు. చిరునవ్వుతో అందర్నీ చూస్తూ పెద్ద మూట కట్టుకుంది. నెత్తిమీద బరువుగా పెట్టుకుని, రావి చెట్టు రొదలో కలిసేలా ఏదో కూని రాగం తీస్తూ నడక ప్రారంభిస్తూంది. "సక్కూ!" అన్న పిలుపు వినిపించినట్లయి వులిక్కిపడి వెనక్కి చూసి, తన భ్రమకి తానే నవ్వుకుంటుంది. బ్రహ్మాండమైన 'ఎంప్రెస్ గేటు' దాటి, మామిడి చెట్టు నీడలో నడిచిపోతుంది సక్కు.

**(1956)**